(సిద్ధిపురి కథలు)

# ఆశ

**-ఐతా చంద్రయ్య**

శరభేశ్వరాలయం వద్ద లోకల్ బసెక్కి ఏ.జీ. సెంటర్లో దిగింది శివాని. కాలేజీలో ఆమెను బ్యూటీ క్వీన్ అంటారు.

అప్పుడే హీరో హోండా దిగిన అమరేందర్... అదే ఆవిడ క్లాస్‌మేట్... కంటబడగానే మనసు చిందర వందరై పోయింది.

కొటీశ్వరుని ఏకైక సంతానం అమరేందర్. వంకీల జుట్టూ, పొడగాటి చేతులూ, అందమైన ముక్కూ పసందైన మీసకట్టూ, ఖరీదైన సూటూ.. గబగబా ఎదురెళ్ళింది.

"హల్లో అమరేందర్!" అంటూ ఓ చిరునవ్వు పారేసింది.

"నా అందచందాలన్నీ నీవే..." అందామనుకుంది.

కాని అప్పటికే అతడు "హలో!" అంటూ ముందుకెళ్ళి స్నేహితుల్లో కలిసిపోయాడు.

శివాని కింది పెదవి మునిపళ్ళ మధ్య ఇరుక్కుపోయింది. ముంగురుల్ని సర్దుకుంటూ క్లాసు వైపు నడిచింది.

ఏదన్నా రూటు వెతకాలి, అమరేందర్‌కు దగ్గరవాలి. అతని ఎదలో తన ఒంపుసొంపుల విత్తనాలు చల్లి ప్రేమ పంట పండించాలి. కోటీశ్వరుని కోడలైపోవాలి...స్వర్గ సుఖాలనుభవించాలి... ఆలోచన అల్లుకుపోయింది.

అదే రోజు సాయంత్రం అమరేందర్ గదికి ఒంటరిగా వెళ్ళింది. నవ్వుతూ పలుకరించింది. లోకాభిరామాయణం నడిచింది.

మరో రోజెళ్ళి నవ్వించింది. మాటల్లో మ్యాజిక్ చూపించింది. పగలబడి నవ్వారిద్దరూ. నెలరోజుల్లో చేతిలో చెయ్యేసి నడిచింది. విజయం చేరువలో ఉందనుకుంది.

"రోజూ సాయంత్రం ఆలస్యంగా వస్తున్నావేమిటి!" మందలించిందోసారి తల్లి.

"మాది చాలా ఎద్ద కోర్సమ్మా, రోజూ ప్రైవేట్ క్లాసులే. నేనేం చేయాలి?" కొట్టిపారేసింది.

ఓరోజు కోమటి చెరువు గట్టుమీద జంటగా నడిచింది. అతని భుజాలమీద చేతులేసి....

"నన్ను మీ ఊరు తీసుకెళ్ళవా అమర్?" అడిగింది కాటుక కళ్ళను కమ్మగా తిప్పుతూ.

"తప్పకుండా. రేపే వెళ్దాం నా బండిమీద." అనేశాడు. శివాని గుండెల్లో శివరంజని పలికింది.

అనుకున్నట్టుగానే మర్నాడు హీరో హోండామీద అరగంటలో ఊరెళ్ళారు. అది పుష్పక విమానం లాగన్పించిందామెకు. మనసు మబ్బుల్లో తేలి ఆడింది.

అమరేందర్ ఇల్లు మూడంతస్తుల భంగళా, రాజసం ఉట్టిపడుతోంది. అతని చేతిలో చెయ్యేసి వెంట నడిచింది. అతని తల్లిదండ్రులు ఎదురొచ్చారు నవ్వుతూ...

"ఈ అమ్మాయెవరూ?" అడిగింది తల్లి. తండ్రి పరిశీలనగా చూస్తున్నాడు.

శివాని గుండెల్లో సంతోష తరంగాలు.

"ఈమె పేరు శివాని. నా క్లాస్‌మేటు. చాలా మంచిపిల్ల, చలాకీగా ఉంటుంది. అందరితో కలుపుగోలుగా ఉంటుంది" చెప్పాడు.

"మరి..." ఏదో అనబోయాడు తండ్రి.

"ఈమె నాకు చాలా దగ్గరైంది నాన్నా!"

"అంటే...!"

"ఈ శివాని నాకు దేవుడిచ్చిన చెల్లెలు, నాకు అక్కా చెల్లెళ్ళు లేరుగదా! కదా శివానీ!" శివాని కళ్ళలోకి చూచాడు.

షాక్ కొట్టినట్టయి పక్కకు జరిగింది. పెదాలమీద బలవంతపు చిరునవ్వు మెరిసింది.

"ఈరోజు రాఖీ పూర్ణిమ కదూ, రాఖీ కట్టించుకోవాలని తీసుకొచ్చావా! రామ్మా!" ఆప్యాయంగా భుజం తట్టింది తల్లి.




-ఐతా చంద్రయ్య

ఇ.నెం.4-4-11, శేర్పుర,

సిద్ధిపేట - 502 103.